క్లుప్తంగా

కలెక్టరేట్‌లో సుందరీకరణ పనుల పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను కలెక్టర్ పి. రాజాబాబు గురువారం పరిశీలించారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి ఈవీఎం గోడౌన్ వరకు సీసీ రోడ్లను పక్కాగా నిర్మించాలన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు మరుగుదొడ్లను నిర్మించాలని చెప్పారు. సుందరీకరణ పనులను శరవేగంగా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. సురేష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్, ప్రాజెక్టు మానిటరింగ్ ప్రతినిధి కేవీ రావు పాల్గొన్నారు.

బందరులో కరోనా కేసు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో గురువారం ఒక కరోనా కేసు నమోదైంది. స్థానికంగా ఓ వృద్ధాశ్రమంలో తలదాచుకున్నంటున్న 70 ఏళ్ల వృద్ధుడికి వైరస్ సోకింది. మంచానికే పరిమితమైన ఈయనకు ఈ వైరస్ ఎలా సోకిందనేది ప్రశ్నార్థకంగా మారింది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడిని ఈ నెల 27న సాయంత్రం సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో 10 మందికి కరోనా టెస్టులు చేయగా ఆయనకు పాజిటివ్ రిపోర్టు రావడంతో ఆస్పత్రిలోని టీబీ వార్డును కరోనా వార్డు గా ఏర్పాటు చేసి అందులో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. బాధితుడు చికిత్స పొందుతున్నా డని ఆస్పత్రి కోవిడ్ నోడల్ ఆఫీసర్, అసో సియేట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ చెప్పారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన



కమ్మనమోలు(నాగాయలంక): కమ్మనమోలు, సంగమేశ్వరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర గ్రామ సభలు గురువారం ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ నేతృత్వంలో జరిగాయి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించే దిశగా సభలు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. డ్రోన్‌ల సహాయంతో వ్యవసాయం సాగితే రైతులకు కలిగే ప్రయోజనాలను యాత్ర కో–ఆర్డినేటర్ తుంగల గిరి వివరించారు. ఈ సందర్భంగా డ్రోన్‌లతో ఎరువులు, విత్తనాలు పిచికారీ చేసే విధానాలపై డెమో ప్రదర్శించారు. క్యాలెండర్లు, బ్రోచర్లు ఆవిష్కరించి సంకల్ప్ యాత్ర ఆవశ్యకతపై ప్రమాణం చేయించారు.

మూడో రోజుకు చేరిన పైడమ్మ సంబరాలు



పెడన: పెడన పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో పైడమ్మ జాతర మహోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. భక్తులు పెద్దఎత్తున శిడిబండ్లను కట్టి మంగళ వాయిద్యాలు, డీజేలతో నృత్యాలు చేసుకుంటూ ఒకరిపై ఒకరు పసుపు చల్లుకుంటూ ఊరేగింపుగా పైడమ్మ ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలింగ్ నమూనాపై ఓటర్లకు అవగాహన

అన్నవరం(మోపిదేవి): ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మోపిదేవి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్నవరం, మెరకనపల్లి, టేకుపల్లి, చిరువోలు గ్రామాల్లో గురువారం ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామ ప్రముఖులు, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీఆర్వోలు మూర్తి, శ్రీనివాసరావు, దుర్గ గణేష్, ఓటర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కృత్తివెన్ను: మద్యం సేవించి వాహనాలు నడపరాదని బందరు రూరల్ సీఐ హబీబ్‌బాషా అన్నారు. గురువారం ఆయన కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్‌తో కలిసి 216 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాలను కలిగి ఉండటం, సేవించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అట్టివారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, ప్రజలు ఈ విషయాలను గమనించాలన్నారు. బంటుమిల్లి ఎస్‌ఐ పైడిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు





తలగడదీవిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ విమలకుమారి: బందరులో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన పేర్ని కిట్టు



గూడూరులో ఖోఖో ఆడుతున్న బాలికలు



తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

నాగాయలంక: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. నాగాయలంక మండలంలో నాలుగు జోన్లుగా నాగాయలంక, తలగడదీవి, ఏటిమొగ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో గురువారం ఖోఖో క్రీడలో క్రీడాకారులు తలపడ్డారు. తలగడదీవి హైస్కూల్‌లో ఖోఖో పోటీలను ప్రారంభించిన తహసీల్దార్ జె.విమలకుమారి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్, ఎంఈఓ ఎ.రామారావు, పీఆర్ ఏఈఈ వాసుదేవరావు, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ పర్యవేక్షించారు. ఆయా జోన్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం కబడ్డీ పోటీలు జరిగాయని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. శుక్రవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు. మండల వ్యాప్తంగా వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు 3,054 మంది పురుషులు, 1,193 మంది మహిళలు మొత్తం 4,247 మంది రిజిస్టర్ చేసుకున్నారని వివరించారు.

బందరులో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు నగరంలో అపూర్వ స్పందన లభించింది. గురువారం షటిల్ బాట్మింటన్ పోటీలు జరిగాయి. నగరంలోని 16 డివిజన్ల నుంచి 36 టీమ్‌లు పోటీ పడ్డాయి. 72 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) షటిల్ బాట్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పర్లం సతీష్, శ్రీరాం చిన్నా, వైఎస్సార్ సీపీ నాయకులు బడే భానుతేజ, బూరగ రామారావు, ఆంజనేయులు, షటిల్ బాట్మింటన్ పోటీల పర్యవేక్షకుడు బేతపూడి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో కూడా నగరంలోని పలు డివిజన్ల క్రీడాకారులు షటిల్ బాట్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు..

గూడూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో భాగంగా గూడూరు మండలంలో మూడో రోజు ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. సచివాలయ స్థాయిలో జరిగిన పోటీల్లో భాగంగా 13 సచివాలయాలలో 26 మ్యాచ్‌లు జరిగాయి. శుక్రవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు.

- కోడూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు గురువారం కొనసాగాయి. కోడూరు, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం జెడ్పీ క్రీడా ప్రాంగణాల్లో అధికారులు ఆటల పోటీలు నిర్వహించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా వాలీబాల్ పోటీలు జరిగాయి. యువత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. జెడ్పీ పాఠశాలల పీఈటీల పర్యవేక్షణలో పోటీలు జరుగుతుండగా, సచివాలయ సిబ్బంది క్రీడాకారులకు అవసరమైన వసతులను సమకూర్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.
- చల్లపల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గురువారం స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్, ఐటీఐ కళాశాలల్లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పర్యవేక్షించారు.
- కోనేరుసెంటర్: బందరు మండలం తాళ్లపాలెం, కానూరు జెడ్పీ హైస్కూళ్లలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు సాగుతున్నాయి. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు, కానూరు జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు జరిగాయని, పోటీలకు విశేష స్పందన లభిస్తోందని బందరు ఎంపీడీఓ బాలకృష్ణ తెలిపారు. ఆటల పోటీలను ఆయన పర్యవేక్షిస్తున్నారు.

సజావుగా పారిశుద్ధ్య పనులు



మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు సజావుగా నిర్వహించేందుకు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ చర్యలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామునే నమస్తే డివిజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి పారిశుద్ధ్య పనులను యథావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. దీంతో ఆయా డివిజన్లలో కూడా పారిశుద్ధ్య పనులు జరిగేలా ఆమె చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 2వ డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్ పలు డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. 2, 11 డివిజన్లలో కార్మికులు యథాతథంగా విధుల్లో పాల్గొనేలా వారు చర్యలు తీసుకున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ టి. పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికుల ఫోన్ కాల్‌కు సమాధానం ఇస్తామని చెప్పారు. సెల్: 99592 25462 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు ఇవ్వవచ్చునని చెప్పారు.

దీవుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఎదురుమొండి(నాగాయలంక): ఎదురుమొండి దీవుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని, దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఇది సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఎదురుమొండి శివారు సచివాలయం పరిధిలోని కృష్ణాపురం, ఏసుపురం, బొడ్డువాని మూల గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే 300 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బ్రోచర్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మేనిఫెస్టోలో 99 శాతానికి పైగా హామీలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. సర్పంచి కన్నా సుధాకీర్తన, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, దివి ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్ (ఎదురుమొండి), కొల్లు యానాదిరావు (నాచుగుంట), పీఏసీఎస్ అధ్యక్షుడు కన్నా రామ్మోహన్‌రావు, ఎంవీ సాంబశివరావు (నాగాయలంక), యూత్ అధ్యక్షుడు రేమాల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

ఎమ్మెల్యే సింహాద్రి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం కలిశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న శిబిరానికి ఎమ్మెల్యే సింహాద్రి వెళ్లి అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

మాజీ సైనిక దంపతుల సైకిల్ యాత్రకు స్వాగతం



మాజీ సైనిక దంపతులతో అసోసియేషన్ సభ్యులు

పెడన: మాజీ సైనిక దంపతులు ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ పురి, డాక్టర్ సోనాపురి దంపతుల సైకిల్‌యాత్రకు పెడన పట్టణ మాజీ సైనికులు గురువారం స్వాగతం పలికారు. మాజీ సైనికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోరుతూ వీరు భువనేశ్వర్ నుంచి పుదుచ్చేరి వరకు 1500 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేపట్టారు. పెడన పట్టణ మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సలీం, కార్యదర్శి అబ్దుల్ రహీం, సంఘ నాయకులు తదితరులు స్వాగతం పలికి సమస్యలు వివరించారు.

- మచిలీపట్నంటౌన్: ఆర్మీ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్‌పురి దంపతులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర గురువారం మచిలీపట్నం చేరింది. ఈ సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో కృష్ణాజిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనిల్‌పురి, సోనియా దంపతులను ఘనంగా సత్కరించారు. అనిల్‌పురి మాట్లాడుతూ మాజీ సైనికులు, వీరనారీమణులు, వితంతువులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జి. వసంతరావు, ఎం. శరత్‌బాబు, నెరేళ్ల వాల్టర్స్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పౌష్టికాహారం అందించండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత రాకుండా సకాలంలో పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి.రాజాబాబు అంగన్‌వాడీ సంఘ నాయకులను కోరారు. గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సకాలంలో పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉన్నందున సమ్మె విరమించాలని కోరారు. విధుల్లో చేరని పక్షంలో జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందని స్పష్టం చేశారు.

ఉపకార వేతనాలు చెల్లించాలని వినతి

మచిలీపట్నంటౌన్: మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఎండీ సద్‌రుద్దీన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ అదనపు కమిషనర్, కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్‌కు అమరావతిలో గురువారం వినతిపత్రం అందజేశారు.

67 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బైపాస్‌రోడ్డు కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 67 మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. 80 మంది హాజరుకాగా వీరిలో 67 మందికి శంషాబాద్‌లోని సోలార్ పవర్ ప్రాజెక్ట్ కంపెనీలో ఉద్యోగాలు లభించాయన్నారు. శుక్రవారం కూడా కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఇంటర్వ్యూలను ఇన్ఫోసోర్స్ ప్రతినిధులు నిర్వహించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ





పడిపూజలో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్) అయ్యప్ప మూలమూర్తి అలంకారం

కోడూరు: 'స్వామియే శరణమయ్యప్ప' అంటూ భక్తులు చేసిన అయ్యప్ప శరణఘోషతో కోడూరు గ్రామం పులకించింది. కోడూరు హరిహరసుతుడి ఆలయ ప్రాంగణంలో 19వ మండలి పూజోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ముందు భాగంలో ఉన్న పదునెట్టంబడికి (18 మెట్లకు) ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పదునెట్టంబడిని వివిధ రకాల పుష్పాలు, దీపాలతో అలంకరించారు. దీనిపై వెలిగించిన మహా పడిహారతిని తిలకించి భక్తులు పులకించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై బుధవారం అయ్యప్ప గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మోర్తోటకు చెందిన గౌరీశంకర్ గురుస్వామి బృందం ఆలపించిన అయ్యప్ప సంకీర్తనలు విశేషంగా అలరించాయి.

లడ్డూల వేలం ద్వారా ఆదాయం..

కోడూరు: కోడూరు అయ్యప్పస్వామి వారి మహా పడిపూజోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాత్రి నిర్వహించిన లడ్డూల వేలం ద్వారా ఆలయానికి రూ.2.35 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూను కృష్ణాపురానికి చెందిన సుందరరావు రూ.55 వేలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నాడు. గణపతి లడ్డూను రూ.44,444, కుమారస్వామివారి లడ్డూను రూ.28 వేలకు లింగారెడ్డిపాలెం పీఠం దీక్షధారులు పాడుకున్నారు. పదునెట్టంబడిలోని 18 మెట్లకు సంబంధించిన లడ్డూలను భక్తులు రూ.1.08 లక్షలకు పాడుకున్నారు. లడ్డూల ద్వారా ఆలయానికి రూ.2,35,444 ఆదాయం లభించిందని వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపారు. పాటదారులను ఆలయ కమిటీ సత్కరించింది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చల్లపల్లి: 15వ ఆర్థిక సంఘం నిధులతో చల్లపల్లిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గురువారం స్థానిక రెండో వార్డు అశోక్ నగర్‌లో 90 మీటర్ల పొడవైన నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, మీర్ రిజ్వాన్, కోట సత్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం



మచిలీపట్నంటౌన్: కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పట్టాభి భవన్‌లో ఆ పార్టీ శ్రేణులు గురువారం నిర్వహించాయి. పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహనరావు, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్, కోకా ఫణిభూషణ్, నల్లబ్రోలు కుమారి, పేరిశెట్టి నాగరాజు, రజియాసుల్తానా, చిలుకోటి ప్రసాద్, కొడమంచిలి చంద్రశేఖర్, పెదపూడి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధి అరిశేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లో రూ. 15 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కిట్టు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం మౌలిక వసతులు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. బందరు మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య విశేష కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ చండిక అజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు సాక్షి చంద్రశేఖర్, సాక్షి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

'దర్శక కేసరి దాసరి' పుస్తకావిష్కరణ

మచిలీపట్నంటౌన్: భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'దర్శక కేసరి దాసరి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత నందం హరిశ్చంద్ర ప్రసాద్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. హరిశ్చంద్ర ప్రసాద్ దాసరితో ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన మాట్లాడుతూ 151 సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నీస్‌బుక్‌లో పేరు నమోదు చేసుకున్న దాసరి 250 సినిమాలకు పాటలు రాశారన్నారు. సినీ రంగాన్ని చెన్నై నుంచి హైదరాబాద్‌కు తరలించడంలో దాసరి చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. ఎన్నో కుటుంబ, దేశభక్తి, ప్రేమ సినిమాలను నిర్మించిన దాసరి సినీరంగానికి ఆదర్శప్రాయుడని వివరించారు. కార్యక్రమంలో సాహిత్య పరిషత్ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, శాస్త్రి, బాలాజీ, కృష్ణమోహన్, రామ్మోహనరావు, భవిష్య, సాంబశివరావు, మేరీ కృపాబాయ్ పాల్గొన్నారు.

రసాయనశాస్త్ర విభాగంలో అడ్మిషన్లకు ఆహ్వానం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేస్తున్నామని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖరరెడ్డి తెలిపారు. అభ్యర్థులు అధ్యాపకులు జి. రవిని సంప్రదించాలన్నారు. అడ్మిషన్ కోరు అభ్యర్థులు ఏపీ పీజీసెట్ పరీక్ష ఖచ్చితంగా రాసి ఉండాలన్నారు. శుక్ర, శనివారాల్లో సీట్లను భర్తీ చేస్తామని, ఇతర వివరాలకు సెల్: 99088 66214 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



గూడూరు: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. గూడూరు మండలం మల్లవోలు పరిసర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఈఆర్‌ఓ అక్కడ దివ్యాంగుల కోసం ర్యాంపులు, పోలింగ్ కేంద్రంలో వెంటిలేషన్, పోలింగ్ కేంద్రంలో భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ గూడూరు మండలంలో 56 పోలింగ్ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 40 కేంద్రాల పరిశీలన పూర్తి కాగా మిగిలిన వాటి పరిశీలన పూర్తయిన తర్వాత ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



బసవపూర్ణమ్మ (ఫైల్)

చినకమ్మవారిపాలెం(నాగాయలంక): చినకమ్మవారి పాలెం గ్రామం మూడో వార్డుకు చెందిన కావూరి బసవపూర్ణమ్మ (85) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆమె నేత్రాలను విజయవాడ తాడిగడపలోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. కుటుంబ సభ్యులు సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతురాలి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

మాజీ ఉప సర్పంచి చౌదరి మృతి



మోహన్ కుమార్ చౌదరి (ఫైల్)

నాగాయలంక: గ్రామ ఉప సర్పంచ్ బాధ్యతల్లో ఉంటూ 1992–93లో స్వల్పకాలం సర్పంచిగా పనిచేసిన ప్రస్తుత అయిదో వార్డు సభ్యుడు తలశిల మోహన్ కుమార్ చౌదరి (65) గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సౌమ్యుడిగా పేరొందిన చౌదరి మరణం తీరని లోటని పంచాయతీ పాలకవర్గం సంతాపం ప్రకటించింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌లు చౌదరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ సర్పంచి కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచి తలశిల నాని, మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు, సబ్బినేని బుచ్చిరామయ్య, తలశిల స్వర్ణలత, మత్స్యకార సంఘాల నేతలు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.